ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.2

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

శుక్రవారం 26 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.70 (303.9495)	2,73,116	2,73,116
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.62 (4.10)	11,124.26	10,376.32
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	167.320 (34.6755)	3,68,435	3,82,670

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

కష్టపడ్డారు.. అనుకున్నది సాధించారు

● సబ్‌కలెక్టర్లుగా ఎంపికైన పేదింటి బిడ్డలు ● డీఎస్పీలుగా పలువురు టీచర్లు ● వివిధ రాష్ట్రస్థాయి ఉద్యోగాలకు ఉమ్మడిజిల్లా అభ్యర్థుల ఎంపిక

ఒక్కొక్కరిది ఒక్కో నేపథ్యం. ఒకరు కూలీ కుటుంబం నుంచి.. మరొకరు మారుమూల తండా నుంచి.. అందరి లక్ష్యం ఒక్కటే గ్రూప్-1. ఎన్నో ఏళ్ల కలను కష్టపడి నెరవేర్చుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యువకులు రాష్ట్రస్థాయి సివిల్స్ అయిన గ్రూప్స్ ఫలితాల్లో సత్తా చాటారు. టాప్‌టెన్‌లో నిలిచిన పలువురు సబ్‌కలెక్టర్లుగా, డీఎస్పీలుగా ఎంపికయ్యారు. మరికొందరు ఉత్తమ మార్కులు సాధించి మునిసిపల్ కమిషనర్లుగా, ఎంపీడీవోలుగా సెలక్ట్ అయ్యారు. వీరి ఎంపికతో ఆయా గ్రామాల్లో బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

7



రాష్ట్రస్థాయి ఆరో ర్యాంక్ సాధించిన హర్షవర్ధన్



డీఎస్పీగా ఎంపికైన కొండమల్లేపల్లికి చెందిన రుచితకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు



ధాన్యం సేకరణకు సాంకేతిక పరిజ్ఞానం

వలిగొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)



- రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు
- కొనుగోలు కేంద్రాల వద్ద వాతావరణ హెచ్చరికలు
- ధాన్యం ఆరబెట్టే యంత్రాలు, ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు
- సన్న బియ్యాన్ని గుర్తించేందుకు డిజిటల్ యంత్రాలు
- 3లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 190 కేంద్రాలు స్వయం సహాయ సంఘాలకు కేటాయింపు

వానాకాలంలో రైతులు పండించినధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. మరో రెండు వారాల్లో వరి కోతలు ప్రారంభంకానున్నాయి. అయితే ఏటా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా ఆరబెట్టిన ధాన్యం వర్షాలతో తడిచి రైతులు నష్టపోవడం సర్వసాధారణమైంది. అయితే ఈసారి కొనుగోళ్లలో జాప్యం, ఇబ్బందులు లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని (టెక్నాలజీ) వినియోగించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో భాగంగా ఈ మారు వాతావరణ హెచ్చరికల బోర్డులను అందుబాటులోకి తేనున్నారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల పరిధిలో వర్షాలు, పిడుగులు పడే పరిస్థితులు ఉంటే కేంద్రం సిబ్బందిని హెచ్చరించనుంది. దీంతో రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఏర్పడనుంది. ప్రస్తుత వానాకాలంలో వరి దిగుబడి గత సీజన్‌కంటే రెట్టింపు ఉంటుందని, మొత్తం 5లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి అవుతుందని అధికారులు అంచనా వేశారు. అందుకు జిల్లాలోని 17 మండలాల్లో 325 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. కొనుగోలు కేంద్రాల్లో మొదటిసారిగా ధాన్యం ఆరబెట్టే యంత్రాలతో పాటు ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లను వినియోగంలోకి తీసుకురానున్నారు. ఆటోమెటిక్ ప్యాడీ క్లీనర్లు జిల్లాకు మొత్తం 79 అవసరం కాగా, ప్రస్తుతం 31 అందుబాటులో ఉన్నాయి. సెమీ ప్యాడీ క్లీనర్లు 325కు 209 అందుబాటులో ఉన్నాయి. తేమ కొలిచే డిజిటల్ మీటర్లు 92 వరకు అవసరమని అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. డ్రయ్యర్లు జిల్లాకు ఐదు అవసరం కాగా, ప్రస్తుతం రెండు అందుబాటులో ఉన్నాయి. మిగతా వాటి కోసం పౌరసరఫరాల శాఖ అధికారులు ఇండెంట్ పెట్టారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని, ధాన్యం తడిచే అవకాశం ఉన్న ప్రాంతాలకు ఈ యంత్రాలను పంపి రైతులకు తోడ్పాటు అందించనున్నారు. వీటికి ఎలాంటి చార్జీ వసూలు చేయరు. అయితే భవిష్యత్‌లో డిమాండ్ అధికంగా ఉంటే డీజిల్‌కు అయ్యే ఖర్చును రైతులు భరించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇక కొనుగోలు కేంద్రాలకు వచ్చే సన్న ధాన్యాన్ని గుర్తించేందుకు 98 డిజిటల్ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సన్న, దొడ్డు రకం ధాన్యం సంచులను కుట్టేందుకు వినియోగించే దారం రంగులు వేర్వేరుగా ఉండనున్నాయి. టార్పాలిన్లు 12,400, తేమను కొలిచే యంత్రాలు 340, ఎలక్ట్రానిక్ కాంటాలు 540, హస్క్ రిమూవర్స్ 370, డ్రయ్యర్లు రెండు, 370 గ్రెయిన్ కాలిపర్స్‌ను కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నారు. ఈ సారి ధాన్యం కొనుగోళ్లకు సాంకేతిక

మిగతా 8వ పేజీలో...

ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు



జిల్లాలో ధాన్యం సేకరణకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. వాతావరణ హెచ్చరికలతో పాటు ప్యాడీ క్లీనర్లు, డ్రయర్లు ఏర్పాటు చేస్తున్నాం. రెండు వారాల్లో అన్ని మండలాల్లోనూ వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. జిల్లాలో 325 కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తాం. ఈ సీజన్‌లో 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యం. రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంతోపాటు, ఇబ్బందులు ఎదురవకుండా ఈ సారి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నాం.

● డి.హరికృష్ణ, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్

మద్యం టెండర్లకు వేళాయె

- నేడు నోటిఫికేషన్, దరఖాస్తుల స్వీకరణ సైతం
- ఉమ్మడి జిల్లాలో ఏ-4 కేటగిరీ దుకాణాలు 329
- 2023లో దరఖాస్తుల ద్వారా రూ.305కోట్ల ఆదాయం
- ఈసారి దరఖాస్తులు పెరుగుతాయని అంచనా



నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కొత్త మద్యం దుకాణాలు (ఏ-4 వైన్స్ దుకాణాలు) నిర్వహణకు ఎక్సైజ్‌శాఖ గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. 2025-27 సంవత్సరానికి శుక్రవారం నుంచి ఆసక్తిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటారు. అక్టోబరు 18 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. వచ్చిన దరఖాస్తుల నుంచి అక్టోబరు 23న కలెక్టర్ సమక్షంలో డ్రా నిర్వహించి దుకాణాలను కేటాయిస్తారు. ఈ టెండర్లలో ఎంపికయ్యేవారు ఈ ఏడాది డిసెంబరు 1వ తేదీ నుంచి 2027 నవంబరు 31 వరకు దుకాణాలను నిర్వహించుకునేందుకు అనుమతి ఉంటుంది. ఎక్సైజ్‌శాఖ టెండర్లలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను ఆయా జిల్లా కేంద్రాల్లోని ఎక్సైజ్ కార్యాలయాలతో పాటు, నాంపల్లిలోని ఎక్సైజ్‌శాఖ ప్రధాన కార్యాలయంలోనూ శుక్రవారం నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు అందజేయవచ్చు. ప్రభుత్వ విధానం మేరకు అన్ని జిల్లాల్లో మద్యం దుకాణాల్లో ఎస్సీ, ఎస్టీ, గౌడ్ (బీసీ) కులస్థులకు రిజర్వేషన్ ఉంటుంది. అందుకు గురువారం ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు డ్రా తీసి కేటాయింపు చేశారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 329 మద్యం దుకాణాల్లో 8 ఎస్టీలకు, 31 ఎస్సీలకు, 82 జనరల్ కేటగిరీకి కేటాయించారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేవారు రూ.3లక్షల విలువైన డిమాండ్ డ్రాఫ్ట్‌ను రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులకు టెండరు దక్కినా దక్కపోయినా ఈ దరఖాస్తు రుసుము వెనక్కిరాదు. రెండేళ్ల క్రితం జరిగిన టెండర్లలో దరఖాస్తు రుసుము రూ.2లక్షలు ఉండగా, ఈసారి రూ.1లక్ష పెంచారు. దరఖాస్తు రుసుము పెంచినప్పటికీ ఈసారి మద్యం దుకాణాలకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్‌శాఖ అంచనావేస్తోంది.

రిజర్వేషన్లు ఖరారు

● లాటరీ డ్రా తీసిన కలెక్టర్ హనుమంతరావు



డ్రా తీస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల కాలపరిమితి(2025-27)తో ప్రభుత్వం మద్యం షాపుల టెండర్లకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో టెండరు రిజర్వేషన్లను గురువారం ఖరారు చేశారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న 82 మద్యం దుకాణాల కేటాయింపునకు కలెక్టర్ హనుమంతరావు లాటరీ తీసి ఎంపిక చేశారు. వాటిలో ఓపెన్ కేటగిరీకి 53 దుకాణాలు, గౌడ కులస్థులకు 21, షెడ్యూల్డ్ కులాలకు 7, షెడ్యూల్ తెగలకు ఒక దుకాణం కేటాయించారు. లాటరీ డ్రా ప్రక్రియను వీడియో రికార్డు చేస్తూ రిజర్వేషన్లు కేటాయించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



చెక్కులను అందజేస్తున్న విప్ అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి పార్టీ సత్తాచాటాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం గుట్టలో ఆలేరు నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 148 మందికి సీఎం సహాయనిధి చెక్కులను అందజేసి మాట్లాడారు. పదేళ్లుగా అభివృద్ధిలో వెనుకబడిన ఆలేరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో గుట్ట మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మంగ సత్యనారాయణ, శంకర్‌నాయక్, నమిలె మహేందర్‌గౌడ్, నాయకులు బందారపు భిక్షపతిగౌడ్, ముక్కెర్ల మల్లేశ్ యాదవ్, దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

● ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పూర్, మెహర్‌నగర్, గౌసుకొండ, రామలింగంపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిధులు వరదలా పారించి అభివృద్ధి పనులు శరవేగంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ అంజన్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి, పీహెచ్ డిప్యూటీ ఈఈ మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ సంధ్య, హెచ్ఎండీఏ ఏఈ వెంకన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత, పీహెచ్ ఏఈ లోకేష్, రాష్ట్ర చేనేత కాంగ్రెస్ నాయకులు తడక వెంకటేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక.. బతుకమ్మ

● కలెక్టర్ హనుమంతరావు



బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ హనుమంతరావు, ఉద్యోగినులు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక.. బతుకమ్మ అని కలెక్టర్ ఎం.హనుమంతరావు అన్నారు. ఐదో రోజు బతుకమ్మ వేడుకలను గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులతోపాటు కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, పలువురు జిల్లా అధికారులు బతుకమ్మ ఆడి పాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలందరూ బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా ఆహార తనిఖీ అధికారి స్వాతి, జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, డీఈఋ్ల్యూవో నర్సింహారావు, క్రీడల అధికారి ధనంజనేయులు, జిల్లా మత్స్య శాఖాధికారి రాజారాం, ఉద్యోగినులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే..

భువనగిరి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యపడుతుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. స్వచ్ఛతా హీసేవా-2025 ఉత్సవాల్లో భాగంగా భువనగిరి మండలం అనంతారంలో శ్రమదానం చేశారు. వ్యర్థాల తొలగింపు, స్వచ్ఛ శ్రామికుల సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ హితమైన అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. స్వచ్ఛగ్రామంకోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండడంతోపాటు గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఏపూరి భాస్కర్‌రావు, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీవో సురేశ్, ఎంపీవో దినకర్, పంచాయతీకార్యదర్శి నర్సింగ్‌రావు, ఏపీవో బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు ఏవీ?

● మాజీ ఎమ్మెల్యే సునీతా మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏమి ఏర్పాట్లు చేశారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం యాదగిరిగుట్టలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు రాజ్యాంగ ప్రకారం పార్లమెంట్‌లో ఆమోదం పొందిన తర్వాతే, అమలవుతాయని, జీవో ఇచ్చేసి ఎన్నికలకు వెళ్లాలని రేవంత్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు సీఎం రేవంత్‌రెడ్డి 54 సార్లు ఢిల్లీ వెళ్లినప్పటికీ యూరియాను తీసుకురాలేకపోయారని, యూరియా కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలే కారణమన్నారు. ప్రజలంతా కేసీఆర్‌వైపు చూస్తున్నారని, ఎప్పుడు స్థానిక సంస్థలు నిర్వహించినా బీఆర్ఎస్ జెండా ఎగురుతుందన్నారు.

ప్రీమియర్ కార్మికులకు 19శాతం బోనస్

యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్ గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ కార్మికులకు 19శాతం బోనస్ (రూ.16వేలు) ఇవ్వడానికి యాజమాన్యం ఒప్పుకుందని ప్రీమియర్ కంపెనీ యూనియన్ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. యాజమాన్యంతో చర్చించి బోనస్ ఇప్పించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కర్రె వెంకటయ్య, కసావు శ్రీనివాస్‌గౌడ్, ఆలేరు మార్కెట్ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధబీరయ్య, యువజన విభాగం మండల అధ్యక్ష, కార్యదర్శులు భీమగాని నర్సింహగౌడ్, ముక్కెర్ల సతీష్, గుండ్లపల్లి వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

● ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం

భువనగిరి రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరు తోడ్పాటునందించాలని ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తం సూచించారు. మండలంలోని ఎర్రంబెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునరుద్ధరణకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు వనం శ్రీనివాస్‌ను గురువారం ఆయన సన్మానించారు. మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించి, విద్యార్థులు ఆసక్తిగా చదువుకునేందుకు ఎంతగానో కృషి చేసిన శ్రీనివాస్ సేవలను గుర్తించి శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నేషనల్ టీచర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసి సన్మానించారు.



ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న పురుషోత్తం

త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌తో నష్టం

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్



సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

భువనగిరి గంజ్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):త్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌తో రైతులకు నష్టం వాటిల్లుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో వందల కుటుంబాలు భూమిలేని నిరుపేదలుగా మారే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం ముందు ప్రకటించిన అలైన్‌మెంట్ కాకుండా 28 కిలోమీటర్లు కుదించడంవల్ల పట్టణ, మండల కేంద్రాలకు చేరువలో ఉన్న సారవంతమైన వరి, పత్తి పండే భూములు అత్యధికం కోల్పోతున్నారన్నారు. జిల్లాలోని తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల్లో వేల ఎకరాల రైతుల పట్టాభూములు త్రిపుల్‌ఆర్ భూ సేకరణలో కోల్పోతున్నారన్నారు. త్రిబుల్ ఆర్ సమస్య పరిష్కారానికి ఈ నెల 27న కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేషం, దాసరి పాండు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు అభివృద్ధిలో అందరి పాత్ర కీలకం

● బ్యాంకు చైర్మన్ తడక రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న తడక రమేష్

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోచంపల్లి అర్బన్ బ్యాంకు జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం, అర్బన్ బ్యాంకు అభివృద్ధిలో అందరి పాత్ర కీలకమేనని బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అన్నారు. పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 51వ సర్వసభ్య సమావేశం గురువారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఖాతాదారులు, వాటాదారులనుద్దేశించి మాట్లాడుతూ బ్యాంక్ ప్రగతి పథంలో దూసుకెళ్తోందని, ప్రస్తుతం 15 శాఖలతో ఉన్న పోచంపల్లి బ్యాంకు అతి త్వరలో 22 శాఖలకు విస్తరించనుందన్నారు. సీఈవో సీత శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా సిబ్బందిలోని నైపుణ్యాన్ని పెంచేందుకు నిరంతరం ప్రయత్నాలు సాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బడుగు దానయ్య, మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కర్నాటి పాండు, కస్తూరి సుదర్శన్, పిద్దగోని రంగయ్యగౌడ్, బోగ సిద్దిరాములు, బ్యాంకు వైస్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌కు హాజరైన ఎంపీలతో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి(రౌండప్‌లో)

దక్షిణ ప్రపంచ పార్లమెంటేరియన్ల వర్క్‌షాష్‌నకు భువనగిరి ఎంపీ చామల

భువనగిరి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పర్యావరణం-సుస్థిరతపై అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నిర్వహించిన దక్షిణ ప్రపంచ పార్లమెంటేరియన్ల వర్క్‌షాప్‌కు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. సదస్సులో మొదటిరోజైన గురువారం విశాల స్థాయిశక్తి మార్పిడి, గ్లోబల్ వాతావరణ అవసరాలు, పారిశ్రామిక డీకార్బొనైజేషన్ తదితర అంశాలపై జరిగిన చర్చలలో భారత ప్రభుత్వ ఎంపీల బృందం సభ్యుడిగా భారత వైఖరిని తెలిపారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సహకారం, విధానపరమైన ఆవశ్యకతలు, స్థిరమైన అభివృద్ధి కోసం అనుసరించాల్సిన మార్గదర్శకాలు తదితర అంశాలపై వర్క్‌షాప్‌లో చర్చించారు. పలు దేశాలకు చెందిన ఎంపీలు ఈ సదస్సులో పాల్గొన్నారు.

అనాథ సీనియర్ సిటిజన్లకు పోలీసుల ఆసరా



గుట్టలో ఓల్డ్ ఏజ్ కిట్స్ అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అనాథ సీనియర్ సిటిజన్లకు పోలీస్‌శాఖ ఆసరాగా ఉంటుందని యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణ, మండలంలోని సీనియర్ సిటిజన్లకు ఓల్డ్ ఏజ్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారైన అనాథ సీనియర్ సిటిజన్లకు తప్పకుండా పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటుగా సీఐ బొడ్డుపల్లి భాస్కర్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్‌పీడీసీఎల్ తరహాలో మాకూ న్యాయంచేయరూ

● ఎన్‌పీడీసీఎల్ పరిధిలో సెమీస్కిల్డ్ వర్కర్లుగా మీటర్‌రీడింగ్ కార్మికుల గుర్తింపు

● టీజీఎస్‌పీడీసీఎల్‌లో పాతపద్ధతి

తెలంగాణ విద్యుత్ శాఖలో తాము వివక్షకు గురవుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీఎస్‌పీడీసీఎల్) మీటర్ రీడింగ్ కార్మికులు వాపోతున్నారు. ఒకే తరహా పని చేస్తున్న మరో డిస్కం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్‌పీడీసీఎల్) మీటర్‌రీడింగ్ కార్మికులను సెమీస్కిల్డ్ వర్కర్లుగా గుర్తించి తమను విస్మరించడం సరికాదంటున్నారు. వారికి 18 రోజుల పాటు రూ.550 అందజేస్తూ ఉపాధి కల్పించిన తీరుగానే తమకు అవకాశం ఇవ్వాలంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్)



మీటర్ రీడింగ్ తీస్తున్న కార్మికుడు

తెలంగాణ విద్యుత్ శాఖలో రెండు డిస్కంలు ఉన్నాయి. ఒకటి హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే తెలంగాణ రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీఎస్‌పీడీసీఎల్) కాగా మరొకటి నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్‌పీడీసీఎల్) వరంగల్ కేంద్రంగా పనిచేస్తోంది. ఈ డిస్కంలలో 20 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మీటర్ రీడింగ్ తీస్తూ నెలసరి వేతనం రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు పొందుతున్న కార్మికులు పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా గత నెలలో ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని మీటర్‌రీడింగ్ కార్మికులను సెమీ స్కిల్డ్‌వర్కర్స్‌గా గుర్తించి అదనపు పనిదినాలం కల్పిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. రోజుకు రూ.550 చొప్పున 18 రోజులకు ఉపాధి కల్పిస్తున్నారు.

ఒకే తరహా పని అయినా..

టీజీఎస్‌పీడీసీఎల్ నిర్ణయం ప్రకారం తమకు కేటాయించిన ప్రాంతాల్లో ప్రతినెలా మొదటి 6, 7 రోజుల్లో ప్రతి ఇల్లు తిరిగి మీటర్ రీడింగ్ నమోదుచేయాలి. ఇందుకోసం విద్యుత్ మీటర్ల సంఖ్య ఆధారంగా గ్రామీణప్రాంతాల కార్మికులకు సుమారుగా రూ. 5వేలు, పట్టణ కార్మికులకు రూ.7వేల వరకు వేతనం లభిస్తోంది. ఆ నెలలో మిగతా రోజులలో ఆ కార్మికులు తమ సొంత పనులకు వెళ్లవచ్చు. కానీ అధికారులు ఆ కార్మికులతో బిల్లుల వసూలు, తదితర పనులను బలవంతంగా చేయిస్తున్నాయి. భవిష్యత్‌లో ఉద్యోగ భద్రత ఉంటుందనే ఆశతో ఖిమ్మనకుండా నెలరోజులపాటు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఎన్‌పీడీసీఎల్ పరిధిలో మాత్రం నెలలో మొదటి 12 రోజుల్లో మీటర్‌రీడింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా కార్మికుల దీర్ఘకాలిక డిమాండ్‌ను మన్నిస్తూ వారిని సెమీస్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తిస్తూ నెలలో మిగిలిన 18 రోజుల్లో రోజుకు రూ.550 కూలీతో అదనపు పనిదినాలు కల్పిస్తూ కంపెనీ యాజమాన్యం ఆగస్టు 8న ఉత్తర్వులు జారీ చేసి మరుసటి రోజు నుంచే అమలులోకి తెచ్చింది. దీంతో అక్కడి కార్మికులకు నెలకు సుమారుగా రూ.10 వేల పైబడి వేతనం లభిస్తోంది. కానీ టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో మాత్రం పాతవిధానాలే అమలు చేస్తుండటంతో ఇక్కడి కార్మికులు అన్యాయానికి గురవుతూ ఆర్థికఇబ్బందులతో అల్లాడుతున్నారు.

ఈ నేపథ్యంలో ఎన్‌పీడీసీఎల్ విధానాలను ఇక్కడా అమలుచేయాలని ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు ఇటీవలే మూడు జిల్లాల ట్రాన్స్‌కో ఎస్ఈలకు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ యాజమాన్యం, అధికారుల నుంచి స్పందన కొరవడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో

టీజీ ఎస్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 9.45 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 426 మంది మీటర్‌రీడింగ్ కార్మికులు ప్రతినెలా ప్రతి మీటర్ రీడింగ్‌ను నమోదు చేసి స్పాట్‌బిల్లింగ్ ఇస్తున్నారు. స్పాట్ బిల్లింగ్ ఆధారంగానే గృహజ్యోతి వర్తింపు, బిల్లువసూలు ఉంటుంది.

విశ్వాసాన్ని వమ్ము చేయవద్దు



ఎన్‌పీడీసీఎల్ మాదిరిగానే టీజీఎస్‌పీడీసీఎల్ మీటర్ రీడింగ్ కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తాం. ఈపాటికే ఆందోళనలు ప్రారంభించాం. కార్మికులను శ్రమదోపిడీకి గురిచేయవద్దు. యాజమాన్యంపై విశ్వాసంతో ఏళ్ల తరబడిగా తక్కువ వేతనాలకు పనిచేస్తున్న కార్మికులకు అన్యాయం చేయవద్దు.

డీ సునీల్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర మీటర్ రీడర్స్ యూనియన్

మాకూ న్యాయం చేయాలి



మీటర్‌రీడింగ్ కార్మికులకు యాజమాన్యం మాకూ న్యాయం చేయాలి. సెమీ స్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తించి అదనపు పనిదినాలు కల్పించాలి. 20 ఏళ్లుగా పనిచేస్తున్నా వేతనం రూ.5 వేల నుంచి రూ.7వేల లోపే లభిస్తుండటంతో కార్మికుల కుటుంబాలు అల్లాడుతున్నాయి. ఎన్‌పీడీసీఎల్ విధానాన్ని ఇక్కడా అమలు చేయాలి.

పిక్కి శ్రీనివాస్‌రావు, యూనియన్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు.



వివాదాస్పదస్థలం వద్ద సీఐ చరమందరాజు

12 మంది బైండోవర్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించి 12 మందిని బైండోవర్ చేసినట్లు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. బస్తీ దవాఖాన ప్రాంతంలో దేవుడి పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. బైండోవర్ అయిన వ్యక్తులు ఘర్షణలు సృష్టిస్తే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. హుజూర్‌నగర్ పరిధిలోని మాధవరాయని గూడెం ప్రాంతానికి చెందిన రెండువర్గాలకు చెందిన 12 మందిని బైండోవర్ చేశామని, తిరిగి ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం వివాదాస్పద స్థలాన్ని సీఐ పరిశీలించారు. ఆయన వెంట బస్తీ దవాఖాన డాక్టర్ సుప్రియ పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణిస్తూనే ఆభరణాల చోరీలు

● నిందితుల నుంచి 18 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్, మరొకరు పరారీలో



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న ఎస్పీ నర్సింహ

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులే లక్ష్యంగా చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపారు. వారి నుంచి 18 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 2024ఆగస్టు 18న నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన పులిచింతల అరుంధతి మోతె మండలం విభలాపురం గ్రామంలో బంధువుల వివాహానికి వెళ్తోంది. అందులో భాగంగా తన హ్యాండ్‌బ్యాగ్‌లో 18 తులాల బంగారు ఆభరణాలను తీసుకుని బయలుదేరింది. ఈ క్రమంలో విభలాపురం వెళ్లేందుకు సూర్యాపేటలో బంధువులతో కలిసి ఖమ్మం బస్సు ఎక్కింది. ఆమెను గమనించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా బుద్రాపేట గ్రామానికి చెందిన గారడి జ్యోతి, హైదరాబాద్‌లోని బడంగ్‌పేట్‌కు చెందిన మహ్మద్ షేక్ సమీర్, కడప జిల్లాకు చెందిన దుర్గలు ప్రయాణికుల మాదిరే అదే బస్సు ఎక్కారు. కొంత దూరం వెళ్లాక ఆభరణాలు ఉన్న బ్యాగును చోరీ చేశారు. విభలాపురం వెళ్లాక బ్యాగ్ చూసుకున్న అరుంధతి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే మోతె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సాంకేతికతను వాడుకుని అనుమానితులను గుర్తించినా వారి పూర్తిసమాచారం లభించలేదు. ఈ క్రమంలో ఈ నెల 24న ఖమ్మం-సూర్యాపేట జాతీయరహదారిపై మునగాల సీఐ రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చిన కారులో అనుమానాస్పదంగా ఉన్న జ్యోతి, సమీర్‌లను విచారించారు. ఈ క్రమంలో మోతె మం డల పరిధిలో గతేడాది ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి బ్యాగులోని ఆభరణాలు చోరీ చేసింది తామేనని అంగీకరించారు. అనంతరం వారి కారును తనిఖీచేయగా సుమారు రూ.20లక్షల విలువైన 18 తులాల బంగారు ఆభరణాలు లభించాయి. ప్రధాన నిందితురాలు జ్యోతిపై గతంలో కేసులు ఉండడంతో హైదరాబాద్‌లో విక్రయిస్తే అనుమానం వస్తుందని భావించి ఆభరణాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విక్రయించాలని ఖమ్మం మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్తూ పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. కాగా చోరీ కేసులో దుర్గ అనే మరో మహిళ కూడా పాల్గొన్నట్లు తెలిపారు. బంగారు ఆభరణాలతో పాటు కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ ప్రకటించారు.

ప్రస్తుతం జ్యోతి, సమీర్‌లను కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నామని మరో నేరస్తురాలు దుర్గ పరారీలో ఉందని ఆమెను కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితురాలు గారడి జ్యోతిపై మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో ఏడు చోరీ కేసులు ఉన్నాయన్నారు. చోరీ కేసును చాకచక్యంగా ఛేదించిన మునగాల సర్కిల్, సీసీఎస్ పోలీసులను ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, మునగాల సీఐ రామక్రిష్ణారెడ్డి,అప్పటి మోతె ఎస్ఐ యాదవేంద్రరెడ్డి, సీసీఎస్ ఎస్ఐ హరిక్రిష్ణ ఉన్నారు.

కోడి అన్నవాహికలో ప్లాస్టిక్ వ్యర్థాలు



శస్త్ర చికిత్స అనంతరం కోడి

కోదాడరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో కోడి అన్నవాహికలో చిక్కుకున్న పావు కిలో ప్లాస్టిక్‌వ్యర్థాలను గురువారం శస్త్ర చికిత్స తొలగించారు. అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపినవివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన వెంకన్న చెందిన కోడిపుంజు అన్నవాహిక భాగం ఎనిమిది రోజుల కిందట ఉబ్బి మేతమేయడం లేదు. దీంతో సూర్యాపేట ప్రాం తీయ పశువైద్యశాలలో వైద్యం చేయించారు. అప్పటికీ పరిస్థితిలో మార్పులేకపోవడంతో అక్కడి వైద్యుల సలహామేరకు కోదాడ ప్రాం తీయ పశువైద్యశాలకు తీసుకువచ్చారు.కోడిని పరీక్షించి అత్యవసరంగా శస్త్ర చికిత్స నిర్వహించి, అన్నవాహిక భాగంలో ఉన్న పావు కిలో ప్లాస్టిక్‌వ్యర్థాలను, అందులో చిక్కుకున్న ధాన్యం వ్యర్థాలను బయటకు తీశారు. కుట్లువేసి విజయవంతంగా శస్త్రచికిత్స ముగించినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు. శస్త్రచికిత్సలో సిబ్బంది చంద్రకళ, అఖిల్, సాగర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి



హనుమయ్య(ఫైల్‌ఫొటో)

ఆత్మకూరు(ఎస్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం దాచారం గ్రామంలో విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ బుడిగబోయిన హనుమయ్య(58) గురువారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దాచారం గ్రామానికి చెందిన పులుగుజ్జు మల్లయ్య అనే రైతు వ్యవసాయ పొలం వద్ద బోర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఎలక్ట్రీషియన్ హనుమయ్యను మరమ్మతుల కోసం తీసుకెళ్లాడు. విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై హనుమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు హనుమయ్య మృతదేహంతో రైతు మల్లయ్య ఇంటి ఎదుట ఆందోళన చేశారు. కాగా రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన కొనసాగుతోంది. హనుమయ్య కూమారుడు శంకర్ ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ దస్తగిరి తెలిపారు. కాగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపట్టారు. రైతు మల్లయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ దస్తగిరి తెలిపారు. హనుమయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైలుకు ఎదురెళ్లి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ-కొండ్రపోల్ రైల్వేమార్గంలో వెళ్తున్న చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలుకు సుమారు 40 ఏళ్ల వయసుగల వ్యక్తి ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే రైలుపట్టాలపై గాయాలతో ఓ వ్యక్తి పడిఉండగా గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. బ్లాక కలర్ జీన్‌పాయింట్, తెల్లషర్టు అతడి శరీరంపై ఉందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మిర్యాలగూడ రైల్వేస్టేషన్ మాస్టర్ రామారావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని మృతుడి ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వరుస చోరీలకు పాల్పడిన దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్, ఎస్సైలు మహేశ్వర్, రత్నం

చివ్వెంల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా చివ్వెంలలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22న సూర్యాపేట పరిధిలోని కొండలరాయినిగూడెంలో వల్లపు రాణి, కొంపెల్లి జయమ్మ, అల్లి మల్లిక ఇళ్లలో వరుసగా చోరీలు జరిగాయి. వీటిపై బాధితులు ఫిర్యాదు చేయగా విచారణ ప్రారంభించామన్నారు. గురువారం మండలంలోని బీబీగూడెం శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సూర్యాపేట పట్టణంలోని సీతారాంపురంకాలనీకి చెందిన గంపల శ్యామ్‌కుమార్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. విచారణలో కొండలరాయినిగూడెంలో వరుస దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని డీఎస్పీ ప్రసన్నకుమార్ వెల్లడించారు. నిందితుడి నుంచి ద్విచక్రవాహనం, 15.25 గ్రాముల బంగారం, 274 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐలు మహేశ్వర్, రత్నం, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ఉన్నారు.

ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలి

కట్టంగూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచకొండ వెంకన్న డిమాండ్ చేశారు. ఈ నెల 27న కట్టంగూరులో నిర్వహించే సంఘం 4వ మహాసభ కరపత్రాలను గురువారం నల్లగొండ జిల్లా కట్టంగూరులో ఆవిష్కరించారు. మద్యం దుకాణాల్లో గౌడ కులస్థులకు రిజర్వేషన్ పెంచితే ప్రభుత్వానికి లాభం తప్ప నష్టం ఉండదన్నారు. 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు పింఛన్‌తో పాటు ద్విచక్రవాహనాలు, ప్రతి గ్రామంలో తాటి, ఈత వనాల పెంపకానికి భూమి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల అంజయ్య, గుడుగుంట్ల బుచ్చిరాములు, దండెంపల్లి శ్రీను, మాద శ్రీను, పాడిచేటి వీరయ్య, గుండాల నగేష్, రాములు, సత్తయ్య ఉన్నారు.

వేబ్రిడ్జిలో తప్పుడు తూకాలతో మోసం

● పట్టుకుని నిలదీసి, వేబ్రిడ్జి గదికి తాళం వేసిన రైతులు



వేబ్రిడ్జిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

మోత్కూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజీపురంలో వేబ్రిడ్జిలో తూకంలో తేడాలను గుర్తించిన రైతులు వ్యాపారిని నిలదీసి, తాళం వేసి నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అనాజీపురం గ్రామానికి చెందిన మలిపెద్ది సంతోష్ రెడ్డి గురువారం రెండు ట్రాక్టర్లలో ధాన్యం తెచ్చి స్థానిక వేబ్రిడ్జిపై తూకం వేయించి ప్రైవేటు వ్యాపారి అంతటి నర్సయ్యకు విక్రయించాడు. అయితే ధాన్యం తూకం రావాల్సినంత రాలేదన్న అనుమానంతో ధాన్యం దిగుమతి చేశాక ఖాళీ ట్రాక్టర్‌ను సమీపంలోని దాచారం వేబ్రిడ్జిపై తూకం వేయించాడు. దీంతో తూకాల్లో క్వింటా 40 కిలోలు తేడా(తక్కువగా) ఉన్నట్లు గుర్తించాడు. అక్కడ తీసుకున్న తూకం రశీదును చూపి అనాజీపురం వేబ్రిడ్జి నిర్వాహకుడిని నిలదీశాడు. ఇదే సమయంలో అక్కడికి పలువురు రైతులు చేరుకుని తాము ఇలాగే మోసపోయి ఉంటామని భావించి వ్యాపారిని ప్రశ్నించారు. రెండు ట్రాక్టర్లలో మొదటి ట్రాక్టర్ తూకం సరిగానే వచ్చిందని, రెండో ట్రాక్టర్ తూకం సమయంలో జంప్ అయి తక్కువ తూకం వచ్చిందని వ్యాపారి వివరించాడు. తక్కువ వచ్చిన ధాన్యానికి డబ్బులు ఇస్తానని చెప్పి రైతును సముదాయించేందుకు ప్రయత్నించాడు. మిగతా రైతులు ఒప్పుకోకుండా తాము కూడా నష్టపోయి ఉంటామని, తమ సంగతేమిటంటూ నిలదీసి, కార్యాలయ గదికి తాళం వేసి, వేబ్రిడ్జిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గదికి తాళం వేయడంతో ఆ వ్యాపారి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తూనికలు, కొలతల అధికారులు వేబ్రిడ్జిని పరిశీలించి తక్కువ తూకంతో మోసం చేస్తున్న వ్యాపారిపై చర్య తీసుకోవాలని కోరారు. కొద్దిసేపటి తర్వాత రైతులు వెళ్లిపోయారు. ఈ విషయమై ధాన్యం వ్యాపారి నర్సయ్యను ప్రశ్నించగా రైతు రెండు ట్రాక్టర్ల ధాన్యం తీసుకురాగా ఒక్క ట్రాక్టర్ తూకం సక్రమంగానే ఉందని, వేబ్రిడ్జి కనెక్టు అయిన వైర్లలో లూజు కాంటాక్ట్ ఉండటంతో జంప్‌అయి ఒకదానిలో మాత్రమే తూకంలో తేడా వచ్చిందన్నారు. తేడా వచ్చిన మేర ధాన్యం డబ్బులు ఇస్తానని చెప్పానన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు సౌమ్య ఎంపిక



సౌమ్య

కనగల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీఎడవల్లి ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థి పర్సనబోయిన సౌమ్య జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. హైదరాబాద్ నిజాం కళాశాలలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరపున ఆడనున్నట్లు హెచ్‌ఎం దొడ్డి విజయలక్ష్మి, పీడీ నారాయణ కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా సౌమ్యకు పలువురు అభినందించారు.

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



అద్వితిరియా మృతదేహం

కట్టంగూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన సిమెంటు లారీ ఆగి ఉన్న కారును ఢీకొనటంతో బాలిక దుర్మరణం చెందింది. గురువారం నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ముత్యాలమ్మ గూడెం గ్రామశివారులోని జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డకు చెందిన కందుల లాజరస్ భార్య కందుల రుతుఝూన్సీ, కుమార్తె లవీన, మనుమరాళ్లు ఎండీ.అరీనా, రెమిడాల అద్వితిరియా (14) కారులో హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యలోని ముత్యాలమ్మగూడెం శివారు గచ్చుగూరి చెరువు వద్దకు రాగానే కారు టైరు పంక్చర్ అయ్యింది. డ్రైవర్ ఏర్పుల సామేల్ కారును రహదారి పక్కన నిలిపి టైరు మార్చుతున్న క్రమంలో రుతుఝూన్సీ, లవీన, అరీనా కిందకు దిగి పక్కకు నిలబడగా, అద్వితిరియా కారు ముందు నిలబడింది. అదే క్రమంలో కోదాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు ముందు నిలబడిన అద్వితిరియాకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సాయంతో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తాత లాజరస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు.

ట్రాక్టర్ కింద పడి వృద్ధురాలు

శాలిగౌరారం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల పరిధిలో ట్రాక్టర్ కింద పడి వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వల్లాల పంచాయతీ పరిధిలోని జోలం వారిగూడెం గ్రామానికి చెందిన జోలం మల్లమ్మ(60) హైదరాబాద్‌కు వెళ్లింది. గురువారం సాయంత్రం జోలం వారిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళా స్కూటీపై వెనక కూర్చుని స్వగ్రామానికి వస్తోంది. మార్గమధ్యలో నిర్మాణంలో ఉన్న రోడ్డుపై స్కూటీ నుంచి జారి పడింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆమె మీది నుంచి పోవడంతో మల్లమ్మ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న మహిళా ప్రాణాపాయ నుంచి బయటపడింది. మృతురాలు మల్లమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దుబాయ్ ఏజెంట్ చేతిలో మోసపోయిన మిర్యాలగూడవాసి

స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యుల వేడుకోలు



వివరాలు తెలుపుతున్న గౌస్ కుటుంబ సభ్యులు.

పంజాగుట్ట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుబాయిలో ఏజెంట్ చేతిలో మోసపోయి అక్కడే దిక్కుతోచని స్థితిలో ఉన్న మొహమ్మద్‌గౌస్‌ను తీసుకురావాలని నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఆయన కుటుంబ సభ్యులు వేడుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ రాంనగర్ ప్రాం తానికి చెందిన మొహమ్మద్ గౌస్ భార్య అమీనా సౌఘత్, పిల్లలు అనిసా విసాల్, హర్షత్ వసీల్ అరుభా వాఫియా, ఆసిమ్ వాఫిక్, అతడి తల్లి మహమ్మద్ అఫ్జల్ ఉన్నిసాబేగంలతో కలిసి తన గోడును వెళ్లబోసుకుంది. మొహమ్మద్ గౌస్ స్థానికంగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడని, సంపాదన సరిపోక పోవడంతో దుబాయికి వెళ్లి డబ్బులు సంపాదించుకుని వస్తా అని చెప్పాడన్నారు. ఏజెంట్ సమీర్‌ను సంప్రదించగా రూ.1.20 లక్షల వరకు ఖర్చు వస్తుందని చెప్పగా, అప్పు చేసి 2023 మార్చి 21న దుబాయికి వెళ్లాడన్నారు. అక్కడ సమీర్ తన భర్తకు ఒక కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పెట్టించాడని, 4 నెలల పాటు అతనే చేతి ఖర్చులకు డబ్బులు కూడా ఇచ్చారని తెలిపింది. ఈ క్రమంలో సమీర్ వద్ద పనిచేస్తున్న విక్కీ అలియాస్ హిమాన్షు శుక్ల వేద్, డ్రైవర్ అలీ ముగ్గురు కలిసి తన భర్త పాస్‌పోర్ట్, వీసా, ఇకామాలను తీసుకున్నారని, కొన్నిపత్రాలపై సంతకాలు, వేలిముద్ర తీసుకుని తప్పుడు పత్రాలతో బ్యాంకులో పర్సనల్ రుణం, క్రెడిట్ కార్డు తీసుకుని పారిపోయారన్నారు. వారికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందని తన భర్త తెలిపాడని చెప్పింది. దీంతో వెనక్కి తిరిగి రాలేక, డబ్బులు లేక 18 నెలలుగా స్నేహితుల వద్ద తల దాచుకుంటున్నాడని ఆవేదన చెందారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి, స్పందించి గౌస్‌ను స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కష్టపడ్డారు.. అనుకున్నది సాధించారు

● సబ్‌కలెక్టర్లుగా ఎంపికైన పేదింటి బిడ్డలు ● డీఎస్పీలుగా పలువురు టీచర్లు ● వివిధ రాష్ట్రస్థాయి ఉద్యోగాలకు ఉమ్మడిజిల్లా అభ్యర్థుల ఎంపిక ● గ్రూప్-1 ఫలితాల్లో మెరిసిన మనోళ్లు

రాష్ట్రస్థాయి 6వ ర్యాంకు..


హర్షవర్ధన్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన పూనాటి హర్షవర్ధన్(హాల్ టికెట్ నెం. 240911138) సబ్‌కలెక్టర్‌గా ఎంపికయ్యారు. గ్రూప్-1లో 525.5 మార్కులతో 6వ ర్యాంకు సాధించిచారు. పరీక్ష రాసిన హర్షవర్ధన్ ఆరో ర్యాంకుతో టాప్‌టెన్ జాబితాలో చోటు దక్కించుకున్నాడు. పట్టణంలోని సరస్వతినగర్‌కు చెందిన పూనాటి తిరుపతిరావు-రాజ్యలక్ష్మీ దంపతుల కుమారుడైన హర్షవర్ధన్ పదో తరగతిలో 568 మార్కులు, ఇంటర్‌లో 972 మార్కులు సాధించారు. అనంతరం హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీలో ఇంజినీరింగ్(కంప్యూటర్ సైన్స్) విద్యను పూర్తి చేసి అమెజాన్‌లో ఆకర్షణీయమైన ప్యాకేజీతో కొలువుదీరాడు. కలెక్టర్ కావాలన్న లక్ష్యంతో యూపీఎస్సీ(ఐఏఎస్)కి ప్రిపేరైన హర్ష టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష రాసి 525.5 మార్కులతో ఆరో ర్యాంకు సాధించి సత్తాచాటాడు.

మారుమూల తండా నుంచి..


అశోక్

దామరచర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో మండలంలోని దుబ్బతండాకు చెందిన తెజావత్ అశోక్‌నాయక్ సబ్ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. మారుమూల తండాకు చెందిన అశోక్‌నాయక్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. అశోక్‌నాయక్ 1 నుంచి 7వ తరగతి వరకు కొండ్రపోల్ నేతాజి హైస్కూల్‌లో, 8 నుంచి పదో తరగతి వరకు అవంతీపురం గిరిజన పాఠశాలలో, కోదాడ సనా కళాశాలలో పాల్‌టెక్నిక్‌ను పూర్తి చేయగా బీటెక్‌ను హైదరాబాద్ ధ్రువ కళాశాలలో పూర్తిచేశారు. అనంతరం సివిల్స్ లక్ష్యంగా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన కోచింగ్‌లో శిక్షణ పొంది ఇటీవల విడుదలైన గ్రూప్-1లో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌నాయక్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మెడికల్ షాప్ యజమాని కుమార్తె డీఎస్పీ


రుచిత

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పట్టణకేంద్రానికి చెందిన ఎల్లబోయిన రుచిత గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగాన్ని సాధించారు. మిర్యాలగూడ మండలం మొలకల పట్నం గ్రామానికి చెందిన ఎల్లబోయిన రవి, శోభ దంపతులు 30 ఏళ్ల క్రితం కొండమల్లేపల్లికి వచ్చి మెడికల్ షాప్‌ను నిర్వహిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. తమ ఏకైక కుమార్తె రుచిత గ్రూప్-1 ఫలితాల్లో 502.5 మార్కులు సాధించి, డీఎస్పీగా ఎంపికయ్యారు. డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన తమ కుమార్తెకు తల్లిదండ్రులు మిఠాయిలు తినిపించి ఆశీర్వదించారు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం


సందీప్

తిరుమలగిరి: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన పత్తి సందీప్‌కుమార్ గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 257 ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. అతని ఎంపికపై కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సివిల్ సాధించడమే తన లక్ష్యమని, డీఎస్పీగా ఎంపికైనందుకు ఆనందంగా ఉందని సందీప్ తెలిపారు. తండ్రి వెంకటాద్రి జనగామ జిల్లా కొడకండ్ల జడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి లలిత అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా మనోజ్ రెడ్డి


మనోజ్‌రెడ్డి

మునుగోడు రూరల్: మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన నన్నూరి వెంకటరమణారెడ్డి విజయలక్ష్మి కుమారుడు మనోజ్‌రెడ్డి గ్రూప్-1 ఫలితాల్లో 11వ ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. 2019 నుంచి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ, గ్రూప్-1లో 11వ ర్యాంక్‌తో పాటు గ్రూప్-2లో 186 ర్యాంక్, గ్రూప్-3లో 337 ర్యాంక్ సాధించారు. తల్లి విజయలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, తండ్రి నన్నూరి వెంకటరమణారెడ్డి వ్యవసాయం చేస్తారు.

ఉపాధ్యాయుడి నుంచి డీఎస్పీగా..


పి.రవి

నాగారం: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో మండలంలోని పణిగిరి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పి.రవి కుమార్ డీఎస్పీగా ఎంపికయ్యారు.ఈయన ప్రస్తుతం తుంగతుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే గ్రూప్-1 సాధించాలనే పట్టుదలతో నిరంతరం కష్టపడ్డారు. మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపికైనట్లు తెలిపారు.

తహసీల్దార్‌గా చేస్తూనే..


నాగార్జున్‌రెడ్డి

హుజూర్‌నగర్, తిరుమలగిరి(సాగర్): మొదటి ప్రయత్నంలోనే హుజూర్‌నగర్ తహసీల్దార్ గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. మల్టీజోన్-2లో 37వ ర్యాంక్ సాధించి కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ అధికారిగా ఎంపికయ్యారు. 2023 నుంచి హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా నాగార్జునరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తూనే గ్రూప్-1 పరీక్షల్లో 488 మార్కులు సాధించారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం బోయగూడెం గ్రామానికి చెందిన భగవంతరెడ్డి, జయమ్మ దంపతుల కుమారుడైన నాగార్జున్‌రెడ్డి 2013లో నిర్వహించిన గ్రూప్-2లో ఎంపికైన ఆయన ప్రస్తుతం తహసీల్దార్‌గా పనిచేస్తూనే గ్రూప్-1 పరీక్షలు రాసి కమర్షియల్ అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ అధికారిగా ఎంపికయ్యారు.

సివిల్స్‌కి ప్రయత్నించి..


నవీన్

ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపన, పట్టుదలతో ఆ యువకుడు ఆరుసార్లు సివిల్స్‌కి ప్రయత్నించాడు. కాగా మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మునిసిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యాడు హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన యరగాని నవీన్. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ కాలనీకి చెందిన యరగాని గురవయ్య, జయలక్ష్మీల పెద్దకుమారుడు నవీన్ మొట్టమొదటి ప్రయత్నంలో గ్రూప్-1 సాధించాడు. ఢిల్లీలో కోచింగ్ తీసుకుని ఆరుసార్లు సివిల్స్‌కి ప్రయత్నించిన నవీన్ నాలుగుసార్లు మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఇటీవల జరిగిన గ్రూప్-1లో ర్యాంక్ పొంది కమిషనర్‌గా ఎంపికయ్యారు.

184వ ర్యాంకుతో..


శ్రీజరెడ్డి

నార్కట్‌పల్లి: నల్లగొండ నార్కట్‌పల్లి మండలంలోని ఎనుగులదొరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్రా శేఖర్‌రెడ్డి కుమార్తె నర్ర శ్రీజరెడ్డి మునిసిపల్ కమిషనర్‌గా ఉద్యోగం సాధించారు. గ్రూప్-1లో 474.5మార్కులతో 184వ ర్యాంకు సాధించిన శ్రీజరెడ్డి మునిసిపల్ కమిషనర్ పోస్టుకు ఎంపికయ్యారు. గతంలో జరిగిన గ్రూప్-4 పరీక్షల్లో మంచి ర్యాంకుతో సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు.

సబ్ జైలర్‌గా.. సతీష్


సతీష్

ఆత్మకూర్(ఎస్): ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన ఆవుల సతీష్ గ్రూప్-1 ఫలితాల్లో 467.5 మార్కులు సాధించి సబ్‌జైలర్‌గా ఎంపికయ్యారు. ప్రభుత్వం విడుదలచేసిన గ్రూప్-1 ఫలితాల్లో మొదటిసారిగా గ్రామం నుంచి విజయం సాధించారు. ఫైర్ ఏడీఎఫ్‌వోగా పనిచేస్తున్న ఆవుల వెంకన్న-ధనలక్ష్మీల ఏకైక పుత్రుడు సతీష్ గ్రూప్-1 ఉద్యోగం సాధించాడు.

మొక్కవోని దీక్షతో


కీర్తన

తిరుమలగిరి(సాగర్): నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన అల్లి కీర్తన గ్రూప్-1లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. మాజీ ఎంపీపీ అల్లి నాగమణి, పెద్దిరాజుల కుమార్తె అల్లి కీర్తన గతంలో రెండు ఉద్యోగాలు సాధించి ప్రస్తుతం వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో సైతం విజయం సాధించి, ఎంపీడీవోగా ఎంపికయ్యారు.

మెరిసిన పీఏపల్లివాసులు



పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం పెద్దగట్టు గ్రామంలోని సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన మూడావత్ బుజ్జి-శంకర్‌ల కుమారుడు వినోద్‌కుమార్ గ్రూప్-1లో మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం సాధించారు. గుర్రంపోడ్ మండలం జిన్నాయిచింతకు ముడుసు శ్రీకాంత్ గ్రూప్-1లో డీఎస్పీ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం కేశంనేనిపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

కూలీ కుటుంబం నుంచి..


భవాని

అనంతగిరి: గ్రూప్-1 ఫలితాల్లో సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామానికి చెందిన చట్టు భవాని డీఎస్పీగా ఎంపికయ్యారు. చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచే భవాని ప్రస్తుతం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూనే.. కష్టపడి చదివి గ్రూప్-1 సాధించారు.


సందీప్



నరేందర్


నిఖితారెడ్డి

పేదింటి విద్యా కుసుమాలు

సూర్యాపేట(కలెక్టరేట్): గ్రూప్-1లో ఇద్దరు యువకులు డీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చివ్వెంల మండలం రోళ్లబండతండాకు చెందిన భీమ్లానాయక్ కుమారుడు నరేందర్ తెలంగాణ ట్రాన్స్‌కోలో 2018లో ఏఈగా ఉద్యోగం సాధించి ప్రస్తుతం హైదరాబాద్‌లో మౌలాలిలో గల 220 కేవీ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికయ్యారు. మరో యువకుడు పెన్‌పహాడ్ మండలం చినగారకుంటతండాకు చెందిన సైదానాయక్ కుమారుడు సందీప్ గ్రూప్-1లో డీఎస్పీగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం తిరుమలగిరి మండలంలోని గుండెపురి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో గ్రూప్-1లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సూర్యాపేట పట్టణానికి చెందిన రంగారెడ్డి-లక్ష్మీ దంపతుల కుమార్తె నిఖితారెడ్డి గ్రూప్-1లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల నిలిపివేత


నీటి విడుదల నిలిపివేసిన ఎడమ కాలువ

నాగార్జునసాగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాలువకు గురువారం ప్రాజెక్టు అధికారులు నీటివిడుదలను నిలిపివేశారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాల్వ ఆయకట్టులో రైతులకు ప్రస్తుతం సాగునీరు అవసరం లేకపోవడంతో నీటి విడుదలను నిలిపివేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయకట్టులో కురుస్తున్న వర్షాలతో పంటపొలాలు పడవకుండా కూడా రైతుల విన్నపం మేరకు కూడా నీటి విడుదలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా సాగర్ ప్రాజెకు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312. 0450 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 586.70 అడుగులుగా (303.9495టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9019 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కులు, ఎస్ ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని, 26 క్రస్ట్ గేట్లలో 22 గేట్లను 5 అడుగుల మేరకు, 4 గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి 2,28,024 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.సాగర్ నుంచి మొత్తం 2,73,116 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 2,73,116 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు వరద నీటి రాక కొనసాగుతోంది. 10 రోజులకు పైగా హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు మూసీ ఎగువ పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా దిగువన గల మూసీ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రానికి 10,376.32 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా గురువారం సాయంత్రానికి కొంతమేర తగ్గి 7,836.40 క్యూసెక్కులగా నమోదైంది. దీంతో అధికారులు 2, 3, 4, 8, 10 నంబరు క్రస్ట్ గేట్లను రెండు అడుగులు ఎత్తి 7,9909.92 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు 383.76 క్యూసెక్కుల సాగునీటిని కలిపి మొత్తం 8,434.90 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు 645అడుగులు(4.46 టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుత నీటి మట్టం 643.42 అడుగులు(4.05టీఎంసీ)లుగా ఉంది.

వైభవంగా యాద'గిరి'ప్రదక్షిణ

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి జన్మనక్షత్రం సందర్భంగా గురువారం సామూహిక గిరి ప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాల నడుమ ఆలయ ఏఈవో గజ్వేల్లి రఘు, ఇతర అధికారులతో కలిసి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు అర్చకులు చేపట్టారు. గిరిప్రదక్షిణలో స్వామివారిని స్తుతిస్తూ కోలాట నృత్యాలు, భజనలు, కీర్తనలతో కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాలు మార్మోగింది. గిరిప్రదక్షిణలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ విప్ గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామక్రిష్ణారెడ్డితో పాటు పలువురు పార్టీ శ్రేణులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనం చేశారు. గిరిప్రదక్షిణ పూర్తి చేసి అనంతరం మెట్ల దారిలో కొండెక్కిన భక్తుల్లో 1,500 మందికి మాత్రమే ప్రత్యేక దర్శన క్యూలైన్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించేందుకు అనుమతించారు. అధిక సంఖ్యలో వాహనాలపై తరలిరావడంతో వైకుంఠద్వారం ఇరువైపులా రోడ్లు కిలో మీటరు మేర (కూడలి) నిండిపోయింది. వాహనాల పార్కింగ్‌తో ప్రదక్షిణ భక్తుల రాకపోకలకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం ఆరగింపు సమయం (12గంటలకు) వరకు సుమారు 28వేల మంది భక్తులు ప్రదక్షిణ పూర్తి చేసుకున్నారు. వైకుంఠద్వారం నుంచి ఆధ్యాత్మిక గీతాలు, కీర్తనలు, కోలాట నృత్యాలు దారి పొడవునా భక్తులను అలరింపజేయగా భజనలు, కీర్తనలతో దివ్య క్షేత్రం ప్రతిధ్వనించింది.


నదీ జలాల కలశంతో అర్చకులు, ఆస్థాన విద్వాంసులు

అష్టోత్తర శతఘటాభిషేక పూజలు

ఆలయంలో స్వామివారి స్వాతి జన్మనక్షత్రం పురస్కరించుకొని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థానపరంగా ఆరాధనల అనంతరం ఉత్సవమూర్తులకుహారతి నివేదించారు.

శివాలయంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట దేవస్థానం అనుబంధ శివాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో నాలుగో రోజు గురువారం శ్రీలలితాదేవి అమ్మవారిని పూజారులు కొలిచారు. ఉదయం ప్రాతఃకాల పూజ అర్చనలు, పారాయణాలు, శ్రీదేవి మూలమంత్ర జపాలు, మధ్యాహ్నం చతుషష్టి ఉపచార పూజలు, నీరాజన మంత్ర పుష్పాలు, సాయంత్రం నవావరణ పూజలు, చతుషష్టి ఉపచార పూజలు, సహస్రనామార్చనలు, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం జరిగింది. కాగా స్వామివారికి వనపర్తికి చెందిన వేదవ్యాస్ గురువారం రూ. 1.30 లక్షల విలువ గల కిలో వెండి దేవస్థానానికి కలశాల నిమిత్తం అందజేశారు


గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు


గిరిప్రదక్షిణలో పాల్గొన్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు, మాజీ విప్ గొంగిడి సునీత

రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మలతో మాజీ ఎమ్మెల్యే సతీమణి కంచర్ల రమాదేవి, శైలజ, శోభ

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో వైభవంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ని వివిధ కాలనీల నుంచి మహిళలు కళాత్మకమైన, ఆకర్షణీయమైన బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకువచ్చి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పలువు రు నాయకులు మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించే సంస్కృతి తెలంగాణ ప్రజలదన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మహిళలు పోటీ పడి తీరొక్క పూలతో బతుకమ్మలను తీసుకువచ్చారు. బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు తీసుకొచ్చిన బతుకమ్మలలో ఉత్తమమైన వాటిని గుర్తించి బహుమతులు అందజేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో బతుకమ్మలను తీసుకెళ్లి సమీప కాల్వలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మహిళా సంఘం నాయకులు, రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్‌రెడ్డి, నా య కులు కొట్టం మధుసూదన్‌రెడ్డి, గుజ్జ జగన్‌మోహన్‌రెడ్డి, అలుగుబెల్లి రామిరెడ్డి, వంగాల అనిల్‌రెడ్డి, గాదె సైదిరెడ్డి, కోట్ల అశోక్‌రెడ్డి, కంచర్లకుంట్ల వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రత కోసం గంట సమయం కేటాయించాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ రోజుకు గంట సమయం కేటాయించాలని చౌటుప్పల్ మునిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారి వెంట పడవేసిన చెత్తా, చెదారంతో పాటు వ్యర్థ పదార్థాలను దివీస్ సంస్థ కార్మికులు, మునిసిపల్ కార్మికులు సంయుక్తంగా గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దివీస్ జీఎం పి. సుధాకర్, మేనేజర్ అంజయ్య, ఆర్‌వో శ్రీధర్‌రెడ్డి, దివీస్ సంస్థ ప్రతినిధులు శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి


మునుగోడులో ముఖ్యనాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజాసంక్షేమ, అభివృద్ధి పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రక్రియ అనే అంశంపై మునుగోడు క్యాంప్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి అక్రమాలతో ప్రజాధనం లూటీ చేసి అప్పుల భారం మోపిందని ఆయన ఆరోపించారు. ఈరకంగా ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూనే ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తూ ముందుకు వెళ్తుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచి త కరెంటు, రేషన్ కార్డుల పంపిణీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి వివిధ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈపథకాలను ప్రజల ముందు ఉంచి స్థానిక ఎన్నికల్లో సానుకూలత వాతావరణంలో ప్రజాదారణ పొందాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈమేరకు ప్రజల మధ్యన ఉంటూ మద్దతు పొందాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి


ఐలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న కొండూరు సత్యనారాయణ, తదితరులు

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శుక్రవారం (నేడు) తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తుందని ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఐలమ్మ జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ కొండూరు సత్యనారాయణ కోరారు. జిల్లాకేంద్రంలోని సాగర్ రోడ్డులో రజక భవనం వద్ద ఐలమ్మ విగ్రహం వద్ద ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఎ ఆమంచి అంజయ్య, చిలకరాజు చెన్నయ్య, దామర వేణు, చిలకరాజు సతీష్, సత్తయ్య, లక్ష్మయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉండ్రుగొండ ఆలయంలో తెప్పోత్సవం



చివ్వెంల సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. అలాగే దుర్గామాత దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి స్వామి విగ్రహాలను స్థానిక చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ ఏడీఈ మణికంఠ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణ కుమార్, డాక్టర్ రామయ్య, కృష్ణమోహన్, శ్రీనివాస్, శ్రీరాములు పాల్గొన్నారు.

CLASSIFIEDS

SITUATION VACANT

★ Wanted Mathematics, English and Science Teachers. Good Pay. Damaracharla. 8008000361 AJH-3068

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED

NLG+SRPT+YGT (3Dist)

210/- Only

Extra Line 45/- Only

For Ads Contact :

NALGONDA DIST
9985413656
9985413365

SURYAPET DIST
9703618713,
9985401015

YADADRI BHONGIRI DIST
8885995946

మహిళలందరికీ బతుకమ్మ చీరల పంపిణీ చేయాలి

రామన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలందరికి దసరా కానుకగా చీరల పంపకాన్ని మహిళా సంఘాల సభ్యులకే కాకుండా రాష్ట్రంలో ఉన్న ప్రతీ మహిళకు ఇవ్వాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కమిటీ మెంబర్, మాజీ ఎంపీటీసీ ఊట్కూరి శోభనరసింహ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్ఎఫ్ఐడబ్ల్యూ మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అల్లపు దుర్గమ్మ, జంగమ్మ, లక్ష్మమ్మ, మంగమ్మ, పార్వతమ్మ, మౌనిక, సునీత ఉన్నారు.

పీహెచ్‌సీలో వైద్య శిబిరం

గుండాల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థనారి స్వశక్తి పరివార్ అబియాన్ కార్యక్రమంలో భాగంగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, సురక్షిత ప్రసవాలు, రక్తహీనత నిర్మూలనపై వైద్యులు అవగాహన కల్పించారు. మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్, అర్పిత రెడ్డి, ఉమా, ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కలను నెరవేర్చింది కాంగ్రెస్సే

బొమ్మలరామారం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సొంతింటి కలను నేరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం మండలంలోని తిరుమలగిరి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి ఆయన గృహాన్ని ప్రారంభించి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోని శివ యుజవన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని ఆయన దర్శించుకున్నారు. మండల కేంద్రంలో మల్యాల మండలం రామలింగంపల్లి గ్రామ శివారులో ఉన్న షేక్‌మేట్ ఆప్టిమస్ కంపెనీ ఆధ్వర్యంలో ఇచ్చిన వాటర్ ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్‌పైలెట్, ఎంపీడీవో రాజాత్రివిక్రమ్, తహసిల్దార్ శ్రీనివాసరావు, షేక్‌మేట్ హెచ్ఆర్ దేవేందర్‌రెడ్డి, సింగిర్తి మల్లేష్, మర్రి భగవంతురెడ్డి ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వదినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

అడ్డగూడూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు వానాకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వదినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకర సంఘం ఆవరణంలో ఆ సంఘ చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంఘంలో క్రాప్ లోన్లు, ఎల్‌టీ లోను, పర్సనల్ లోను తీసుకున్న సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డైరక్టర్లు ఆశోక్‌రెడ్డి, పోగుల నర్సిరెడ్డి, వేముల బిక్షం, వీరస్వామి , మానుపాటీ బిక్షం,బాలెంల ఎల్లమ్మ, కడారి శ్రీశైలం, అంబటీ జోస్పినమ్మ, పండుగ నర్సయ్య, సంగు సురేందర్ రెడ్డి, సీఈవో వెంకటేశ్వర్లు, నాయకులు సత్యనారయణా, సోమన్న పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మేలు



స్వచ్ఛోత్సవ్‌లో పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ రామలింగం

భువనగిరి టౌన్/ ఆలేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్యానికి, పట్టణ సుందరీకరణకు మేలు జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం అన్నారు. స్వచ్ఛతా హీ సేవా 2025 స్వచ్ఛోత్సవ్ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం భువనగిరి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ఖిల్లా పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సహకరిస్తేనే పారిశుధ్య పనులు విజయవంతం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో డీఈ కొండల్‌రావు, మేనేజర్ నరేశ్‌రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ జాఫర్ అలీ, హెల్త్ అసిస్టెంట్ రజిత, మెప్మా శ్యామల, సువర్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ప్రతీ ఒక్కరు పాల్గొని పట్టణాలను పరిశుభ్రంగా తీర్చి దిద్దాలని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ కోరారు. గురువారం ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగు, తొమ్మిది వార్డుల్లో చేపట్టిన స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో పాల్గొని వీధుల్లో పెరిగిన గడ్డిని రోడ్లపై ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో మేనేజర్ జగన్మోహన్, వార్డు ఆఫీసర్లు ఆర్‌పిలు, పారిశుధ్యకార్మికులు పాల్గొన్నారు.

30న సద్దుల బతుకమ్మ, 2న దసరా

భువనగిరి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మను ఈనెల 30 (మంగళవారం), దసరా పండుగను అక్టోబరు 2 (గురువారం) నిర్వహించుకోవాలని బ్రాహ్మణ సేవా సంఘం, బ్రాహ్మణ సేవా సమితి ప్రజలకు సూచించింది. ఈ మేరకు గురువారం భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో పండుగల తేదీలపై ప్రజలకు స్పష్టత ఇచ్చింది. తిథి ప్రకారమే పండుగలను జరుపుకోవాలని, వ్యక్తిగత అభిరుచుల కోసం పండుగల తేదీల మార్పు కుదరదని తెలిపారు. అవగాహనకు కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో సంఘం, సమితిల జిల్లా అధ్యక్షులు కప్పగంతుల నాగరాజుశర్మ, ఆకవరం రమేష్, గంగు జగదీశ్వర్‌శర్మ, నేరుళ్లపల్లి శ్రీనివాస్‌శర్మ, నేరేళ్లపల్లి మణిశర్మ, రామగిరి కోటేశ్వరశర్మ, చందుపట్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

బునాదిగాని కాల్వకోసం భూసేకరణ చేయాలి: సీపీఎం

మోత్కూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బునాదిగాని (ధర్మారం) కాల్వ కోసం మోత్కూరు మండలంలో పాటిమట్ల తదితర గ్రామాల్లో భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.16.70 కోట్లు విడుదల చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు వనం శాంతికుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన సీపీఎం బృందంతో కలిసి బునాదికాల్వను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న బునాదిగాని కాల్వ తవ్వకం పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.267 కోట్లు మంజూరు చేసి, అందులో భూసేకరణకు సుమారు రూ.70 కోట్లు కేటాయించిందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు చెల్లించేందుకు రూ.16.70 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు బొల్లు యాదగిరి, కుర్మేటి యాదయ్య, మెతుకు అంజయ్య, రాచకొండ కనకయ్య, సోమయ్య, ఎ.నారాయణ, సాయిలు పాల్గొన్నారు.

కుమ్మర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆలేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుమ్మర కులస్థులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంత్‌రావు కోరారు. గురువారం ఆలేరులో జరిగిన కుమ్మర సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా కుమ్మరుల కులవృత్తి మారలేదని అన్నారు. అనంతరం కుమ్మర సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొరుటూరి ఉపేందర్, గౌరవాధ్యక్షుడిగా కొరుటూరి ఇస్తారి, ఉపాధ్యక్షులుగా కిష్టయ్య, ప్రధాన కార్యదర్శిగా సిద్ది లింగం కోశాధికారిగా కె. సత్యనారాయణ ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేష్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కోరుగంటి గోపాల్, దరిపల్లి ప్రవీణ్ కుమార్, మండల కన్వీనర్ గంగాధరి సుధీర్‌కుమార్, కో కన్వీనర్ జివిలికపల్లి సత్యనారాయణ, మండల నాయకులు గంగాధరి సత్తయ్య, మహేందర్, పరమేశ్వర్, శ్రీనివాస్, గణేష్, హరీష్, కె. నర్సింహులు, రాములు, లక్ష్మణ్, భాస్కర్, చంద్రమౌళి, ఉప్పలయ్య, రాజు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అశోక్



అశోక్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భువనగిరి పట్టణానికి చెందిన వేముల అశోక్ గురువారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. భువనగిరి ప్రజల, పార్టీ నాయకుల, కార్యకర్తల సహకారంతోనే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగానని, రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు పదవీ బాధ్యతల స్వీకారోత్సవానికి హాజరై అభినందించారు. నాయకులు కొప్పుల యాదిరెడ్డి, కాటూరి అచ్చయ్య, చందా మహేందర్‌గుప్తా, చందుపట్ల వెంకటేశ్వరరావు, నర్ల నర్సింగరావు, మాయ దశరథ, గూడూరు నరోత్తంరెడ్డి, మేడి కోటేష్, రత్నపురం బలరాం పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

వలిగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంగి మహేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 28న భగత్‌సింగ్ జయంతి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికొయ్యలను సైతం లెక్కచేయకండా భవిష్యత్ తరాల కోసం పోరాటం చేసిన ధీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు.

ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారం

● కలెక్టర్ ఎం.హనుమంతరావు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల అన్ని రకాల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించడానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ప్రతి గురువారం కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి తన చాంబర్‌లో స్వయంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్య పరిష్కారం కాకపోవడానికి గల కారణాలను సంబంధించిన శాఖ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.

● బుడిగె జంగాల కాలనీలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరి చేయాలని మోత్కూరు మండలం అనాజీపురం గ్రామస్థులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో మోత్కూరు ఎంపీడీవోకు ఫోన్ చేసి, పూర్తి విచారణ చేసి అర్హులకు తదుపరి విడతలో అవకాశం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

● చెరువుకు సమీపంలో ఉండటంతో చేతికి వచ్చిన వరిపంట మత్తడి నీటితో పూర్తిగా మునిగిపోయి నష్టపోయామని, మునిగి పోయిన పంట పొలాలను సందర్శించి జరిగిన నష్టానికి పరిహారం అందజేయాలని కోరుతూ యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామ రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయగా సంబందిత అధికారులు విచారణ చేసి నివేదికలు అందజేసిన తర్వాత పరిహారం అందుతుందని తెలిపారు.

● స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్ కల్పించాలని దళిత సంఘాల నాయకులు ప్రజాదర్బార్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం వద్దు

బీబీనగర్: జాప్యం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతురావు లబ్ధిదారులకు సూచించారు. బీబీనగర్ మండలం ముగ్దుంపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఈ వెంట వెంటనే ఇళ్ల ఫొటోలు తీస్తున్నారా..? బిల్లులు పడుతున్నాయా? లేదా? అని లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు.

అంతకుముందు గ్రామంలోని పల్లె దవాఖానాను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో విషజ్వరాల ప్రభావం ఏమైనా ఉంటే వాటి నివారణ చర్యలపై వాకబు చేశారు. గర్భిణులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సాధారణ ప్రసవాల కోసం వారిని సంసిద్ధం చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

కొనసాగుతున్న దేవీ నవరాత్రి, బతుకమ్మ ఉత్సవాలు



స్వర్ణగిరిలో అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

భువనగిరి టౌన్/ భువనగిరి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా దుర్గమ్మ, బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. భువనగిరి సమీపంలోని స్వర్ణగిరిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, కాత్యాయని రూపంలో అలంకరించారు. బతుకమ్మ జిల్లా స్థాయి వేడుకలలో ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. పలు మండపాల్లో నిత్యపూజలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులోని శివశక్తి శిర్డీసాయి పీఠంలో సిద్ధగురు రమణానంద మహర్షి ఆధ్వర్యంలో హోమ పూజలు కొనసాగాయి.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో శివాలయంలో కనక దుర్గా ఆలయంలో , రామ్‌నగర్ కాలనీ అమ్మవారికి కాత్యాయనీ దేవిగా ప్రత్యేక అలంకరణ చేశారు. రామ్‌నగర్‌లో హనుమాన్ యూత్ సభ్యులు నెలకొల్పిన దుర్గామాత మండపం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రామన్నపేట: మండల కేంద్రంలోని గౌడ్స్ వాడలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మాంద్ర నరేష్ నవ్య దంపతులు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో స్థానిక సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు. గణేష్ యూత్ కమిటీ సభ్యులు జల్లె వెంకటేష్, జాల అమరేందర్‌రెడ్డి, బందారపు సాయి, చెరుకు ఉపేందర్, కోనూరు స్వామి, వర్కల నితిన్, అబ్దుల్ అరిఫ్, తాటిపాముల సాయికుమార్, చెరుకు శివకుమార్, మోటె మమేష్, బొల్లెద్దు వంశీ, రాపోలు రాజశేఖర్ పాల్గొన్నారు.

మోటకొండూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు బతుకమ్మను పేర్చి ఆట, పాటలతో ఆడిపాడారు. అనంతరం వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు బతుకమ్మ చీరలను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శిల్పిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఐఓ రామకృష్ణ, మండల వైద్యధికారి విజయ్, హారిక, పార్వతమ్మ, చక్రపాణి, సత్యనారాయణ, నర్సింహ, సుగుణ, అంజుమ్, జ్యోతి, ధనమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని శివారెడ్డిగూడెం గ్రామంలో దుర్గా మాత నవరాత్రిఉత్సవాల్లో బాగంగా విగ్రహ దాత ఉప్పునూతల మాధవి వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో ఎరవేలు శ్రీనివాస్, దొంతరమోని భగవాన్, చిలుకల సంతోష్‌యాదవ్, మేకల రామకృష్ణరెడ్డి, వారాల సురేందర్‌రెడ్డి, చిలుకల శివ, నారి మహేష్, బింగి భాను ఉన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో హరిహర త్రిశక్తి ఆలయంలో పూజలు కొనసాగాయి.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్‌చేశారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఇంచార్జి డీపీవో విష్ణువర్ధన్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల యూనియన్ రాష్ట్ర కన్వీనర్ పొట్ట యాదమ్మ, జిల్లా కార్యదర్శి గడ్డం ఈశ్వర్, లక్ష్మీ, బుజ్జమ్మ, రమేష్, శంకర్, రాము, భాస్కర్, ఉపేందర్, కిష్టయ్య, నరసింహ, యాదగిరి, స్వామి తదితరులున్నారు.

పూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు..

భువనగిరి గంజ్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పూలే, అంబేడ్కర్‌ల చిత్రపటాలకు నివాళుర్పించారు. నేటి నుండి ఐదు రోజుల పాటు మహారాష్ట్రంలో జరిగే పూలే అంబేడ్కర్ స్ఫూర్తి యాత్రకు భువనగిరిలోని పూలే అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్వాహకులు బానోత్ భాస్కర్ నాయక్, దొడ్డి యాదగిరిలు బయలుదేరుతున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇటుకల దేవేందర్, సురుపంగ శివలింగం, అందే సాయి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

వలిగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భువనగిరి కలెక్టరేట్ ఎదుట ఈనెల 27వ తేదీన నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి పిలుపునిచ్చారు. గురువారం మండలంలో వర్కట్‌పల్లి గ్రామంలో ఆర్ఆర్ఆర్ భూ నిర్వసితులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ చిన్న సన్నకారు రైతుల భూములను రీజినల్ రింగ్‌రోడ్డుపేరుతో బలవంతంగా లాకున్ని యప్రయత్నాలను విరమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సోమశేఖర్, శేఖర్, రామచంద్రయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు పోలీసుల చేయూత

మోత్కూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో గోల్డెన్ కేర్ అనే కార్యక్రమంలో భాగంగా గురువారం మోత్కూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మోత్కూరు మండల పరిధిలో ఉన్న వృద్దులకు కేర్ ఫర్ దోస్ హూ కేర్డ్ హజ్ (మిమ్మల్ని మంచిగా చూసుకునేవారిని మీరు మంచిగా చూసుకోండి) అనే టాగ్ లైన్‌తో ఓల్డ్ ఏజ్ కిట్స్ అందించారు. ఎస్ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఓల్డ్ ఏజ్ కిట్స్ అందజేత

అడ్డగూడూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అడ్డగూడూరు మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్స్‌కు గురువారం ఎస్.ఐ వెంకట్‌రెడ్డి ఓల్డ్ ఏజ్ కిట్స్ అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాచకొండ సీపీ ఆదేశాల మేరకు గోల్డెన్ కేర్ కార్యక్రమంలో భాగంగా కేర్‌ఫర్ డోస్ యూ కేర్డ్ అస్ అనే టాగ్ లైన్‌తో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పేదలకు కిట్లను అందజేయడం జరిగిందని ఎస్.ఐ తెలిపాడు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 25: (ఆంధ్రజ్యోతి) మండలంలోని కూరెళ్ల గ్రామ పంచాయతీ లో మూడు పోలింగ్ బూతులు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బి.సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరాడు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూరెళ్ల గ్రామ పంచాయతీలో దాదాపు 1650 మంది ఓటర్లు ఉండగా అధికారులు రెండు బూత్‌లు మాత్రమే ఏర్పాటు చేశారని, దీని వలన స్థానిక ఎన్నికలప్పుడు చాలా ఇబ్బంది కలుగుతోందన్నారు. కూరెళ్లకు కేటాయించిన 303 బూతులో 695, 304 లో 937 ఓట్లు ఉన్నట్లు తెలిపాడు. కాగ 303 లో ఉన్న ఓటర్లు తొందరగా ఓట్లు వేసి వెళ్తున్నారని, 304 బూత్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉండటంతో ఓట్లు వేయడానికి చాల సమయం పడుతుందన్నారు. సమావేశంలో గ్రామశాఖ కార్యదర్శి గనగాని శ్రీనివాస్, కూరెళ్ల రమేష్, సుదగాని లక్ష్మయ్య, బి.లింగయ్య, ఎన్.సహదేవ్ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సాంకేతిక పరిజ్ఞానం

(5వ పేజీ తరువాయి)

పరిజ్ఞానం తోడుకానుండటంతో రైతులకు ఇబ్బందులు తొలగుతాయని అధికారులు భావిస్తున్నారు.

హార్వెస్టర్లపై నిఘా

వరికోతకు వినియోగించే హార్వెస్టర్లకు అక్టోబరు నెలలో భారీగా డిమాండ్ ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా ఈ యంత్రాల ద్వారానే నూర్పిడి చేస్తున్నారు. వరి మెదలు పచ్చిగా ఉన్నా ఈ యంత్రాఆల ద్వారా నూర్పిడి చేయిస్తుండటంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. వరికోతకు వినియోగించే హార్వెస్టర్లకు సంబంధించి పూర్తి వివరాలు తీసుకోవాలని ప్రభుత్వం వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. పూర్తిగా కోతకు రాని పంటలను ముందస్తుగా నూర్పిడి చేయడంతో ధాన్యం గింజలో నాణ్యత దెబ్బతింటుంది. హార్వెస్టర్ బ్లోయర్‌ను యాక్టివ్ మోడ్‌లో పెట్టకుండా డీజిల్ ఆదా చేసే పరిస్థితిని నిరోధించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో జిల్లాలో వినియోగిస్తున్న హార్వెస్టర్ల సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు సన్నద్ధమవుతున్నారు.

3లక్షల మెట్రిక్‌టన్నుల లక్ష్యం

వానాకాలంలో జిల్లాలో 2,82,897ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. మరో రెండు వారాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుంది. ఈ మేరకు రెవెన్యూ, సివిల్‌సప్లయ్, డీఆర్డీవో, కోఆపరేటివ్, మార్కెటింగ్, వ్యవసాయశాఖల అధికారులతో అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈసారి 5లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. అందులో 3లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అందుకు 75లక్షల వరకు గన్నీ బ్యాగులు అవసరం కాగా, 55లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. తొలి విడతగా భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, వలిగొండ, చౌటుప్పల్, రామన్నపేట, బీబీనగర్, రాజాపేట, చౌటుప్పల్ మండలాల్లో కొనుగోలు కేంద్రాలు తెరవనున్నారు.

ధాన్యం సేకరణ బాధ్యత మహిళా సంఘాలకు

ధాన్యం సేకరణలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం కొనుగోలు కేంద్రాల్లో 50శాతం స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయించనున్నారు. ధాన్యం కొనుగోళ్లలో పీఏసీఎస్ పాలకవర్గాల జోక్యం పెరగడం, మిల్లర్లతో కుమ్మక్కై తాలు, తేమ, తరుగు పేరుతో రైతులను మోసం చేయడం వంటి సంఘటనలు గతంలో ఉన్నాయి. అయితే కొనుగోలు బాధ్యతలను మహిళా సంఘాలకు ఇస్తే పారదర్శకంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తం 325 కొనుగోలు కేంద్రాలకు సుమారు 190 కేంద్రాలను మహిళా సంఘాలకు ఇచ్చేందుకు అధికారు లు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం దిగుబడి, కేంద్రాలకు వచ్చే తాకిడి ఆధారంగా అవసరమైతే మరిన్ని కేంద్రాలను పెంచేందుకు కూడా జిల్లాయంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

దీన్‌దయాల్ ఉపాధ్యాయ జీవితం స్ఫూర్తిదాయకం

రామన్నపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు అన్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. రామన్నపేటలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వనం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


మోత్కూరు: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మోత్కూరు పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల, ప్రోగ్రాం కన్వీనర్ తీగల శ్రీధర్‌గౌడ్, నాయకులు గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, అన్నెపు సత్యనారాయణ, కందుకూరి ప్రకాష్, ముత్తినేని తిరుమలేష్, బద్దం మహేందర్‌రెడ్డి, సజ్జనం మనోహర్, మధు పాల్గొన్నారు.



ఆలేరులో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆలేరు: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్, ప్రధాన కార్యదర్శులు సుంకరి సృజన్‌కుమార్, వెంకటేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్డెమాన్ నరేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు పూల హనుమంతు, నాయకులు గుర్రం నర్సింహులు, పల్లెం రాజు, మల్‌రెడ్డి నర్సింహరెడ్డి, బడుగు జహంగీర్, స్వామి, పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాగటి మత్స్యగిరి తన ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి అమ్మ పేరుతో తులసీ మొక్క నాటాడు. కార్యక్రమంలో నాయకులు మజ్జిగ నరేష్, లోడి వెంకటయ్య, పరకాల రాంబాబు పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో మొక్కను నాటుతున్న గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్: పటణంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శాగ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు దూడల బిక్షం గౌడ్, ఆర్. శంకరయ్య, ముత్యాల భూపాల్ రెడ్డి, ఆలె చిరంజీవి, కట్ట కృష్ణ, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కడారి అయిలయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, నాయకులు దాయాకర్, సంతోష్‌కుమార్, రామనర్సు, వెంకటేశం పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ట

బీబీనగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): బీబీనగర్ మండలం రుద్రవెల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ, ఈదమ్మ తల్లి ఆలయాల్లో గురువారం దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు కాంగ్రెస్ జిల్లా నాయకులు పొట్టోళ్ల శ్యాంగౌడ్‌తో పాటు పలువురు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, నాయకులు బాల్ రెడ్డి, నారాయణ రెడ్డి, వెంకటేష్, నవీన్, సుదర్శన్‌రెడ్డి, రాములు, వెంకటయ్య, జాని పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, సమస్యల సాధనకోసం ప్రజలు ఉద్యమాలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని కనుముకుల గ్రామం నుండి భూదాన్‌పోచంపల్లి ఎంపీడీవో కార్యాలయం వరకు సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సూపరిండెంట్ ఏపాల సత్యనారాయణరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల సీపీఎం నాయకులు ప్రసాదం విష్ణు, మంచాల మధు, నెలకంటి జంగయ్య, కల్కూరి భిక్షపతి, కోట జనార్ధన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, జంగారెడ్డి, పాండురంగారెడ్డి, మేకల నరసింహ, భూపాల్‌రెడ్డి, సామ నర్సిరెడ్డి, పాపిరెడ్డి, నిర్మల, సుగుణమ్మ, సుజాత, చుక్క రజినీకాంత్ పాల్గొన్నారు.

పండుగలకైనా కమిషన్ ఇవ్వరా..?

భువనగిరి టౌన్/ భువనగిరి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంతో ప్రజల ఆకలి తీరుస్తున్న రేషన్‌డీలర్స్‌కు పండుగల పూటనైనా ప్రభుత్వం కమీషన్ ఇవ్వదా..? అని జిల్లా రేషన్‌డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగల రాజయ్య అన్నారు. గురువారం భువనగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఆరు నెలలుగా కమీషన్ విడుదల చేయకపోవడంతో రేషన్‌డీలర్లు అప్పులపాలై దసరా, బతుకమ్మ వేడుకలను జరుపుకోవాలంటే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. రేషన్‌డీలర్స్‌కు రూ.5వేతవేతనం, ప్రస్తుత క్వింటాల్ కమీషన్ రూ.140 నుంచి 300కు పెంచుతామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని అన్నారు. వచ్చేనెల బియ్యం పంపిణీని నిలిపివేస్తామని హెచ్చరించారు.

రెడ్‌క్రాస్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

మోత్కూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి గురువారం గవర్నర్ కార్యాలయంలో జాయింట్ సెక్రటరీ భవానీ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.మహేందర్‌రెడ్డి, జిల్లా వైస్‌చైర్మన్ దిడ్డి బాలాజీ, డివిజన్ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

పెట్రోపై జీఎస్టీ ఎత్తివేయాలి

ఆలేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్‌పై విధించిన జీఎస్టీని వెంటనే ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆలేరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ 18శాతానికి తగ్గించిన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డిజిల్‌పై జిఎస్‌టిని ఎత్తివేయకుండా ప్రజలపై భారం మోపడం విచారకరమన్నారు. పార్టీ నాయకులు చౌడబోయిన కనకయ్య, పున్నబోయిన రవి, బొడ్డు అంజనేయులు, రాజు పలువురు పాల్గొన్నారు.